కుంట అలుగు కాలువలో గ్రానైట్ వ్యర్థాలు

రామడుగు, సెప్టెంబర్ 4: వెలిచాల అనుబంధ గ్రామం గుడ్డేలుగులపల్లి శివారులో సుమారు ఐదెకరాల్లో విస్తరించిన వెంకటయ్యకుంట ఇప్పటికే ఆక్రమణకు గురికాగా, పట్టించుకునే నాథుడు లేక సమీపంలోని గ్రానైట్ క్వారీ యజమానులు కుంట అలుగు కాలువలో గ్రానైట్ వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో వెంకటయ్యకుంట అలుగు కాలువ పొడవునా గ్రానైట్ వ్యర్థాలను డంపు చేయడం వల్ల వరద నీరు కిందికి వెళ్లే అవకాశం లేకుండాపోయింది. గత కొన్ని రోజులుగా ఈ తంతు జరుగుతున్నా సంబంధిత అధికారులు అంటిముట్టనట్టు వ్యవహరిస్తుండడంతో ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు.

గుడ్డేలుగులపల్లి శివారులోని వెంకటయ్యకుంటలో గ్రానైట్ వ్యర్థాలు

పండుగలు శాంతియుతంగా జరుపుకోవాలి

రాంనగర్, సెప్టెంబర్ 4 : గణేశ్ నవరాత్రులు, మిలాదున్ నబీ వేడుకలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి పిలుపునిచ్చారు. బుధవారం కమిషనరేట్‌లోని జాన్ విల్సన్ హాల్‌లో శాంతి సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గణేశ్ మండపాల వద్ద పోలీసుల సూచనలు పాటిస్తూ వచ్చే భక్తులకు భద్రత కల్పిస్తూ ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని మండప నిర్వాహకులకు సూచించారు. గణేశ్ ఉత్సవ కమిటీల్లో సంఘ విద్రోహ శక్తులకు, గతంలో అల్లర్లు సృష్టించిన వ్యక్తులకు చోటు కల్పించవద్దన్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా వచ్చే తప్పుడు ప్రచారాలను నమ్మకూడదని, వాటికి స్పందించి ప్రజాశాంతికి భంగం కలిగించే చర్యలకు పాల్పడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. మిలాద్ ఉన్ నబీ పండుగ సందర్భంగా నిర్వహించే ర్యాలీ హైదరాబాద్‌లో నిర్ణయించినట్లు ఈనెల 19వ తేదీన జరుపుకోవాలని, ఈ విషయంలో పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టౌన్ ఏసీపీ నరేందర్, వన్, టూ, త్రీటౌన్ పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, శాంతి కమిటీ సభ్యులు, ఇతర మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

- శాంతి సంక్షేమ కమిటీ సమావేశంలో సీపీ అభిషేక్ మొహంతి

పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలి: నగర కమిషనర్

కార్పొరేషన్, సెప్టెంబర్ 4: నగర పాలక సంస్థలోని ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగంలో పెండింగ్‌లో ఉన్న అన్ని ఫైల్స్ వేగంగా క్లియర్ చేయాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. ఉద్యోగుల సర్వీస్ బుక్స్ ప్రకారం వారికి ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడాలని సూచించారు. నగరపాలక సంస్థలోని తన చాంబర్‌లో ఎస్టాబ్లిష్‌మెంట్ విభాగం అధికారులు, సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఉద్యోగ సిబ్బంది బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం చూపకూడదన్నారు. సర్వీస్ రిలేటెడ్ ఫైల్స్‌తో పాటు రిటైర్డ్, మరణించిన ఉద్యోగులకు సంబంధించిన బెనిఫిట్స్ పెండింగ్, పీఆర్‌సీ, ఇంక్రిమెంట్స్ తదితర ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఫైల్స్ క్లియరెన్స్‌కు సంబంధించి తప్పని సరిగా వారం వారీగా రిపోర్ట్ అందించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ స్వరూపారాణి పాల్గొన్నారు.

న్యాయమూర్తిని కలిసిన కమిషనర్

ప్రిన్సిపల్ జిల్లా, సెషన్ జడ్జి ప్రతిమకు మొక్క అందిస్తున్న నగర కమిషనర్

కరీంనగర్ నగర పాలక సంస్థ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ బుధవారం కరీంనగర్ ప్రిన్సిపల్ జిల్లా, సెషన్ జడ్జి ప్రతిమను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మొక్కను అందజేశారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి: డీఈవో

సైదాపూర్, సెప్టెంబర్ 4: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని డీఈవో జనార్దనరావు ఆదేశించారు. మండలకేంద్రంలో బుధవారం నిర్వహించిన ప్రధాన ఉపాధ్యాయుల సమీక్షా సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు మెరుగుపరుచాలన్నారు. భాషపై పట్టు సాధించేలా దృష్టి సారించాలని చెప్పారు. ఉపాధ్యాయులు వృత్తినిబద్ధత కలిగి ఉండాలని సూచించారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో డీఏవో తనిఖీ

జమ్మికుంట, సెప్టెంబర్ 4: జమ్మికుంటలోని ఎరువుల దుకాణాల్లో జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి హుజూరాబాద్ ఏడీఏ సునీతతో కలిసి బుధవారం తనిఖీలు చేశారు. రైతులకు నాణ్యమైన పురుగు మందులు, ఎరువులు నిబంధనల ప్రకారం విక్రయించాలని, బ్లాక్‌లో విక్రయాలపై కఠిన చర్యలుంటాయని నిర్వాహకులను హెచ్చరించారు. అనంతరం రైతు ఉత్పత్తిదారుల సంస్థ(ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్), డీసీఎమ్మెస్, పీఏసీఎస్, ఆగ్రోస్‌లో ఎరువుల క్రయ, విక్రయాలను పరిశీలించారు. అంతకుముందు జిల్లా వ్యవసాయ అధికారిగా భాగ్యలక్ష్మి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి జమ్మికుంటకు వచ్చిన సందర్భాన్ని పురస్కరించుకుని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీఏవోను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో ఎఫ్‌పీవో మేనేజర్ సాగర్, డీసీఎమ్మెస్ ఇన్‌చార్జి ప్రదీప్, పీఏసీఎస్ సీఈవో రవీందర్, జమ్మికుంట ఇన్‌చార్జి ఏవో రజిత, అసోసియేషన్ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

విరాళం పై చౌకబారు విమర్శలు మానుకోవాలి

కొత్తపల్లి, సెప్టెంబర్ 4 : ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల జేఏసీ వరద బాధితులకు చేయూతనందించేందుకు రూ.130 కోట్ల విరాళాన్ని ప్రకటించగా, హర్షించాల్సింది పోయి చౌకబారు విమర్శలు చేస్తున్న లచ్చిరెడ్డి తీరును జిల్లా జేఏసీ చైర్మన్ దారం (శ్రీనివాస్‌రెడ్డి ఖండించారు. బుధవారం జేఏసీ నాయకులతో కలిసి కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో తహసీల్దార్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కొనసాగిన లచ్చిరెడ్డి ప్రభుత్వ గుర్తింపు లేని కొన్ని సంఘాలు, వ్యక్తులను పోగు చేసి గందరగోళం సృష్టిస్తున్నారని విమర్శించారు. ఆయనపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో టీఎన్జీవోల జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మణ రావు, నాయకులు మడిపల్లి కాళీచరణ్, నాగుల నరసింహస్వామి, రాగి శ్రీనివాస్, మహిళా ఉద్యోగుల జేఏసీ చైర్మన్ తిరుమల, కోట రామస్వామి, శంకర్, ముప్పిడి కిరణ్‌కుమార్‌రెడ్డి, సర్దార్ అరవిందసింగ్, బల్వీందర్‌సింగ్, రాజేశ్ భర్ద్వాజ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

'గురుకులాల కార్యదర్శిని తొలగించాలి'

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 4: గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణిని ఆ స్థానం నుంచి తొలగించాలని ప్రగతిశీల తల్లిదండ్రుల సంఘం జిల్లా ఇన్‌చార్జి మారుతి. జిల్లా అధ్యక్షుడు కుమార్, ఉపాధ్యక్షురాలు సరిత డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో బుధవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఎస్సీ గురుకులాలపై ఆమె నిర్లక్ష్య వైఖరిని అవలంబిస్తున్నారని ఆరోపించారు. గురుకుల పాఠశాలల్లో ఇప్పటికే సరిపడా ఉపాధ్యాయులు లేక బోధన కుంటుపడుతుండగా, ఆరు వందల మంది ఒప్పంద అధ్యాపకులను తొలగించడం సరికాదన్నారు. విద్యార్థులకు సైకాలజిస్టులతో తరగతులను నిర్వహించాల్సి ఉండగా, ఆ బాధ్యతలను బ్రహ్మకుమారీస్ సంస్థకు అప్పగించడమేమిటని ప్రశ్నించారు. స్పోర్ట్ అకాడమీని యథాతథంగా కొనసాగించాలన్నారు. ప్రభుత్వం తన వైఖరి మార్చుకోపోతే తమ పిల్లలతో కలిసి రాష్ట్ర వ్యాప్తంగా ధర్నాలు. నిరసనలు చేపడుతామని హెచ్చరించారు.

పరిహారం అందించాలి

సైదాపూర్, సెప్టెంబర్ 4: మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పంటలు, ఇండ్లకు పరిహారం అందించాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, ప్రధాన కార్యదర్శి చెల్మల్ల రాజేశ్వర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సర్వే చేపట్టి, రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ప్రమోద్‌కుమార్

సైదాపూర్, సెప్టెంబర్ 4: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆకునూర్ బీసీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఎస్‌జీటీ గొల్లూరి ప్రమోద్‌కుమార్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఎంఈవో కె.శ్రీనివాస్‌రెడ్డి, పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు అభినందించారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

హుజూరాబాద్ టౌన్, సెప్టెంబర్ 4: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి వొడితెల ప్రణవ్ బుధవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా ఉంటామని ప్రణవ్ భరోసా ఇచ్చారు. అనారోగ్యం పాలైన పేదలు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు పెట్టుకోవాలని సూచించారు. అలాగే, మానేరు డ్యాం గేట్లు ఎత్తే అవకాశం ఉన్నందున మానేరు పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఉద్యోగోన్నతి పొందిన డీటీకి సన్మానం

ఇల్లందకుంట, సెప్టెంబర్ 4: మండల కేంద్రంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పని చేస్తున్న వరలక్ష్మి తహసీల్దార్‌గా ఉద్యోగోన్నతి పొందగా, బుధవారం తహసీల్దార్ రాణి శాలువాతో సన్మానించారు. తహసీల్దార్‌గా వరలక్ష్మి రాజన్నసిరిసిల్ల జిల్లాకు బదిలీ అయ్యారు. ఇక్కడ సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రావు, ఆర్ఐ రవి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నిరాహార దీక్ష భగ్నం

జమ్మికుంట, సెప్టెంబర్4: ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 467 వివాదాస్పద స్థలంపై 'పెసరు బండ పరిరక్షణ కమిటీ' గుర్రపు మహేంద్రనాథ్, ఎండీ యాకుబ్ బాషా ఆధ్వర్యంలో ఆరు రోజులుగా స్థానిక తహసీల్ కార్యాలయ ఆవరణలో రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో తహసీల్దార్ రమేశ్ బాబు ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు దీక్షను భగ్నం చేశారు. దీక్షలో కూర్చున్న మహేంద్రనాథ్, యాకుబ్‌ను బలవంతంగా పోలీసులు స్టేషన్‌కు తరలించారు. కాంగ్రెస్ పార్టీ, బీజేపీ, తదితర నాయకుల జోక్యంతో పెసరు బండ పరిరక్షణ కమిటీ సభ్యులను పోలీసులు విడిచి పెట్టారు. పెసరు బండ స్థలంపై న్యాయం కోసం ఉద్యమిస్తామని కమిటీ సభ్యులు తెలిపారు.

'వరద బాధితులను పరామర్శించే తీరికలేని కేంద్ర మంత్రి'

తెలంగాణచౌక్, సెప్టెంబర్ 4: నాలుగు రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలతో జిల్లా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, వారిని పరామర్శించి ఆదుకోవాల్సిన ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌కు తీరికలేకుండా పోయిందని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపల్లి రాజు విమర్శించారు. బుధవారం నగరంలోని హనుమాన్ నగర్ కాలనీ ప్రజలతో కలిసి ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో గెలిపించిన ప్రజలకన్నా ముఖ్యమైన పనులు కేంద్ర మంత్రికి ఏమి ఉంటాయని ప్రశ్నించారు. వరద బాధితుల కుటుంబాలను ఆదుకోకుంటే ప్రజల ఆగ్రహానికి గురికావలసి ఉంటుందని హెచ్చరించారు. ఇక్కడ సీపీఐ నాయకులు విజయ్, శంకర్, గణేశ్ ఉన్నారు.

సైదాపూర్‌లో 72.8 ఎంఎం వర్షపాతం

సైదాపూర్, సెప్టెంబర్ 4: మండలంలోని మంగళవారం రాత్రి నుంచి బుధవారం ఉదయం వరకు 72.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. సైదాపూర్, దుద్దనపల్లి, వెన్కేపల్లి, ఆకునూర్ గ్రామాల్లో చెరువులు నిండాయి. పలు గ్రామాల నుంచి వరద సోమారం వైపు వస్తుండడంతో గ్రామ కల్వర్టు వద్ద నీటి ప్రవాహం ఉధృతంగా ఉన్నది. దీంతో రాకపోకలకు తీవ్రఅంతరాయం కలిగింది. సోమారం మోడల్‌స్కూల్ పరిసరాల్లో భారీగా వరదనీరు చేరింది.

మాజీ మంత్రుల వాహనాలపై దాడి దుర్మార్గపు చర్య: పొడితల

చిగురుమామిడి, సెప్టెంబర్ 4: ఖమ్మంలో వరద బాధిత ప్రాంతాల్లో నష్టపోయిన ప్రజలను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ మంత్రులు హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, పువ్వాడ అజయ్ వాహనాలపై కాంగ్రెస్ శ్రేణులు దాడి చేయడాన్ని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీశ్ కుమార్ తీవ్రంగా ఖండించారు. ఈ దాడి దుర్మార్గపు చర్య అని మండిపడ్డారు. కష్టాల్లో ఉన్న ప్రజల వద్దకు వెళ్తే దాడులు చేసే నీచ సంస్కృతి కాంగ్రెస్ పార్టీకే చెందిందని ధ్వజమెత్తారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ చర్యలను గమనిస్తున్నారని అన్నారు. ఇలాంటి దాడులకు బీఆర్ఎస్ పార్టీ భయపడదని, కచ్చితంగా ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యుత్ సిబ్బంది సెలవులు రద్దు

ముకరంపుర, సెప్టెంబర్ 4: భారీ వర్షాల నేపథ్యంలో ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి క్షేత్ర స్థాయిలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ మేరకు కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది సెలవులు అన్ని రద్దు అయ్యాయని, అత్యవసర సెలవు కోసం సీఈ(హెచ్ ఆర్డీ-ట్రైనింగ్)కు సమాచారం ఇవ్వాలని సూచించారు. అధికారులు, సిబ్బంది హెడ్ క్వార్టర్‌లోనే ఉండి ప్రతి గంటకోసారి విద్యుత్ సరఫరా స్థితిని పరిశీలించాలని కంట్రోల్ రూమ్‌లో నిత్యం పనిచేస్తూ, అక్కడి నుంచి ఎప్పటికప్పుడు పరిస్థితులు గమనించాలన్నారు. విద్యుత్ అంతరాయాలు, విపత్కర పరిస్థితులు ఎదురైతే వెంటనే పరిష్కరించాలన్నారు. సిబ్బంది, సామగ్రి, పోల్స్ అందుబాటులో ఉంచి పనులు సత్వరమే పూర్తి చేసేలా కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతికూల వాతావరణం, వరదలు, విద్యుత్ ప్రమాదాలు, ఆస్తి నష్టం వంటి విపత్కర పరిస్థితులుంటే వెంట వెంటనే కార్పొరేట్ ఆఫీస్‌కు తెలియజేయాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, సెప్టెంబర్ 4: నగరంలోని 11కేవీ సుభాష్ నగర్, మంచిర్యాల చౌరస్తా ఎక్స్ రోడ్డు, వెంకటసాయి ఫీడర్ల పరిధిలో కొత్త విద్యుత్ లైన్ పనులు, చెట్ల కొమ్మలు తొలగింపు, ఏబీ స్విచ్ మరమ్మతు పనులు చేపడుతున్నందున గురువారం ఫీడర్ పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ టౌన్-1 ఏడీఈ సాయినేని నరేందర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10నుంచి 11.30గంటల వరకు మంచిర్యాల చౌరస్తా ఎక్స్ రోడ్డు, ఆదర్శనగర్, వావిలాల రాంరెడ్డి నగర్, శివనగర్, అంబేద్కర్ నగర్, బుట్టిరాజారాం కాలనీ, సుభాష్ నగర్, కిసాన్ నగర్, ఎస్సీ కాలనీ, సరస్వతీ నగర్, భారత్ టాకీస్ ఏరియా, పద్మశాలీ స్ట్రీట్, లక్ష్మీనగర్, హనుమాన్ టెంపుల్ రోడ్, షాషా మహల్, శ్రీనివాస టాకీస్ ఏరియాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పంట పాలాల్లో ఇసుక మేటలు

చెంజర్ల శివారులోని పొలాల్లో పేరుకుపోయిన ఇసుక

మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 4: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో శ్రీనివాస్‌నగర్, చెంజర్ల, ముంజంపల్లి, జగ్గయ్యపల్లి తదితర గ్రామాల్లోని వరి పంట పొలాలు నీట మునిగాయి. కొందరి రైతుల పొలాల్లో ఇసుక మేటలు వేయడంతో పాటు గండ్లు పడ్డాయి. అధికారులు సర్వే చేసి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

చెరువు కాదు.. రోడ్డే!

మర్రిగడ్డ వద్ద చెరువును తలపిస్తున్న రోడ్డు

గంగాధర, సెప్టెంబర్ 4: గంగాధర మండలం బూరుగుపల్లి నుంచి రామడుగు మండలం గోపాల్‌రావుపేట గ్రామానికి వెళ్లే రహదారిలో సర్వారెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మర్రిగడ్డ వద్ద రోడ్డు చెరువును తలపిస్తోంది. ఈ రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడడంతో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు గుంతల్లో నీరు చేరింది. గమనించకుండా వాహనాలు గుంతల్లో పడడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించిన రోడ్డుకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

మడిపల్లిలో వైద్య శిబిరం

జమ్మికుంట, సెప్టెంబర్ 4 : వావిలాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మండలంలోని మడిపల్లి గ్రామంలో బుధవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సంధ్య 54మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. జ్వర పీడితులకు మందులు అందించారు. ఇక్కడ హెచ్ఈ మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్ సదానందం, ఏఎన్ఎంలు వనజ, సంధ్య, ఆశ కార్యకర్తలు, తదితరులున్నారు.

మానేరు పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, సెప్టెంబర్ 4: మానేరు ఎగువ పరీవాహక ప్రాంతంతో పాటు ఉత్తర తెలంగాణలో అతిభారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కరీంనగర్ మానేరు డ్యాం గేట్లు ఏ క్షణమైనా ఎత్తడానికి అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, మానేరు డ్యాం దిగువన ఉన్న గ్రామాల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఆయన నివాసంలో బుధవారం ఎమ్మెల్యే మాట్లాడుతూ, డ్యాం దిగువ ఉన్న గ్రామాల్లో సంబంధిత అధికారులు దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. నదీ పరీవాహక ప్రాంతంలోకి పశువులు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు కూడా వ్యవసాయ భూముల వద్దకు వెళ్లవద్దని కోరారు. ముఖ్యంగా హుజూరాబాద్ పట్టణంలోని 17వ వార్డు, బుడగజంగాల కాలనీ, జమ్మికుంట లోని హౌసింగ్‌బోర్డు కాలనీ, వీణవంక మండలం కనపర్తి గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపల్ అధికారులు సహాయక చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని, ప్రజలకు సూచనలు చేస్తూ ఎలాంటి హాని జరుగకుండా చూడాలని ఆదేశించారు.

ఘనంగా తెలుగు భాషా వారోత్సవాలు

కార్యక్రమంలో పాల్గొన్న ఎండీ అనుదీప్, విద్యార్థులు

కమాన్‌చౌరస్తా, సెప్టెంబర్ 4 : జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ అద్వైత ఇంటర్నేషనల్ పాఠశాలలో గిడుగు వెంకట రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా, సాంస్కృతిక ప్రదర్శనలు, సాహిత్య చర్చలు, విద్యా సంబంధ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులు తెలుగు భాష ప్రాధాన్యతపై పాటలు, కవిత్వం పఠనం, శ్లోకాలు, వాచకం, నాట్య రూపకాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ అనుదీప్ సొగాని మాట్లాడుతూ, తెలుగు విభాగం, విద్యార్థుల కృషి, వారి అంకితభావాన్ని అభినందించారు.

కాలిన స్థితిలో మృతదేహం.

- హత్యనా..?ఆత్మహత్యనా.?

తిమ్మాపూర్, సెప్టెంబర్ 4: మండలంలోని ఇందిరానగర్ శివారులో చెట్ల పొదల మధ్యలో కాలిన స్థితిలో ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు కనుగొన్నారు. ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ తెలిపిన వివరాల ప్రకారం.. సిరిసిల్లకు చెందిన సత్తు రఘు(48)కరీంనగర్‌లో నివాసం ఉంటూ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్న సమయంలో రఘు కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. సిగ్నల్ ఆధారంగా వెతకగా నుస్తులాపూర్, ఇందిరానగర్ గ్రామాల మధ్యనున్న దర్గా వెనుక వైపు గల చెట్ల పొదల్లో కాలిపోయిన స్థితిలో మృతదేహం కనిపించింది. దీంతో పోలీసులు రఘుగా నిర్ధారించి మృతదేహాన్ని ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నిర్మానుష్య ప్రదేశంలో పెట్రోల్‌తో కాలిన స్థితిలో మృతదేహం ఉండగా.. ఆత్మహత్య చేసుకున్నాడా..? ఎవరైనా హత్య చేశారా..? అనే విషయాలు తెలియాల్సి ఉన్నది. కుటుంబసభ్యులు ఇంకా ఫిర్యాదు చేయలేదని, ఫిర్యాదు అనంతరం దర్యాప్తు చేస్తామని ఎస్ఐ వివేక్ తెలిపారు.

అడుగుకో గుంత.. ప్రయాణానికి చింత

రామడుగు, సెప్టెంబర్ 4: గోపాల్‌రావుపేట నుంచి మొదలు బూర్గుపల్లి వరకు సుమారు ఏడు కిలో మీటర్ల ప్రధాన రహదారి అడుగుకో గుంతతో అధ్వానంగా తయారయింది. తిర్మలాపూర్ ఎస్సీ కాలనీ మూలమలుపు నుంచి మర్రిగడ్డ వరకు రహదారి పూర్తిగా దెబ్బతిన్నది. భారీ వర్షాల కారణంగా దారి మరింత దెబ్బతినడంతో నడవలేని పరిస్థితి ఏర్పడిందని తిర్మలాపూర్ గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుత ప్రభుత్వం గోపాల్‌రావుపేట నుంచి బూర్గుపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.6 కోట్లను విడుదల చేసి కూడా నాలుగు మాసాలు అవుతున్నదని, ఇకనైనా తమ బాధలకు స్వస్తి పలికేలా రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

తిర్మలాపూర్‌లో అధ్వానంగా ప్రధాన రహదారి

ఓటరు జాబితా సవరణకు సహకరించాలి

శంకరపట్నం/మానకొండూర్ రూరల్, సెప్టెంబర్ 4: ఓటరు జాబితా సవరణకు అన్ని పార్టీలు సహకరించాలని శంకరపట్నం, మానకొండూర్ తహసీల్దార్లు భాస్కర్, రాజేశ్వరి కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో బుధవారం ఆయా మండల తహసీల్ కార్యాలయాల్లో ఓటర్ల జాబితా సవరణపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరపట్నానికి చెందిన పలువురు నాయకులు మాట్లాడుతూ, గతంలో బీఎల్‌వోలు పక్కాగా ఓటరు సర్వే చేయకపోవడంతో పలువురు అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాల నుంచి తొలగించారని ఆరోపించారు. ఆయా చోట్ల నాయబ్ తహసీల్దార్ సమ్మయ్య, గిర్దావర్ ప్రత్యూష, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌధకు తరలిన ఉద్యోగులు

ముకరంపుర, సెప్టెంబర్ 4: విద్యుత్ సంస్థలో బీసీలు, ఓసీలకు ప్రమోషన్లలో న్యాయం చేయాలంటూ తలపెట్టిన చలో హైదరాబాద్ విద్యుత్ సౌధ కార్యక్రమానికి బుధవారం బీసీ, ఓసీ జాక్ ఆధ్వర్యంలో కరీంనగర్ సర్కిల్ కార్యాలయం నుంచి ఉద్యోగులు తరలివెళ్లారు. కార్యక్రమానికి తరలివెళ్లిన వారిలో ఎస్ఈ గంగాధర్, ఏడీఈ సుధీర్ కుమార్, శ్రీనివాస్, సంపత్ రావు, ఏఈలు శ్రీనివాస్, అనిల్ కుమార్, సంపత్ కుమార్, మల్లేశం, బీసీ నాయకులు భద్రపు సత్యం, జనార్దన్, వెల్దండి శ్రీనివాస్, సిద్ధం తిరుపతి, మహేందర్, సతీశ్, ఆశిరి ప్రకాశ్, మాదాసు చంద్రశేఖర్, రమేశ్ తదితరులు ఉన్నారు.

ఎల్ఎండీ ఎస్ఐగా వివేక్

తిమ్మాపూర్,సెప్టెంబర్ 4: ఎల్ఎండీ ఎస్ఐగా తాండ్ర వివేక్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. తిమ్మాపూర్ మండల ప్రజలు ఏమైనా సమస్యలుంటే తమను నేరుగా కలవాలని సూచించారు. చట్ట వ్యతిరేక శక్తుల మీద కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

విరివిగా మొక్కలు పెంచాలి

తిమ్మాపూర్, సెప్టెంబర్4: ఇందిరానగర్ ప్రభుత్వ పాఠశాలలో సీఐ స్వామి బుధవారం ఉదయం మొక్కలు నాటారు. పాఠశాలతో పాటు ఇండ్ల ఆవరణలో విరివిగా మొక్కలు పెంచాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్, మాజీ సర్పంచ్ కాటిక వినోద, గ్